నేడు యోగాలో ఉచిత శిక్షణ

మణికొండ: ఆరోగ్య పరిరక్షణకు అన్ని వయసుల వారు యోగాను నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు శ్రీగురు యోగాలయం తరపున శనివారం ఉచిత శిక్షణను ఇస్తున్నామని సంస్థ నిర్వాహకుడు అమృతరావు తెలిపారు. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. ఔత్సాహికులు కార్యక్రమంలో పాల్గొని యోగాను నేర్చుకోవాలని ఆయన కోరారు.

నేడు నార్సింగిలో ఎమ్మెల్యే పర్యటన

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, నార్సింగి వార్డులలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పర్యటించనున్నారు. రూ. 8.25 కోట్లతో చేపట్టిన కమ్యూనిటీ హాల్‌లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కోకాపేట నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

18 నుంచి క్రీడా పోటీలు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఈ నెల 18 నుంచి 20 వరకు నాల్గవ ఇంటర్ కాలేజీ స్పోర్ట్స్, గేమ్స్, కల్చరల్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అసోసియేట్ డీన్ ప్రశాంత్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలలో రాజేంద్రనగర్, ములుగు, పాలెం నుంచి సుమారు 250 మంది విద్యార్థినీవిద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలి



హిమగిరినగర్ కాలనీలో వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రభుత్వ నిబంధనల మేరకు సర్వే చేసి రేషన్ కార్డుల లబ్ధిదారులను గుర్తించాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర ఫీల్డ్ వెరిఫికేషన్ ఆఫీసర్లకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారుల సర్వే ప్రక్రియను ఆయన పరిశీలించారు. హిమగిరినగర్ కాలనీ, ఇందిరారెడ్డినగర్ కాలనీ, సౌభాగ్యనగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, వికాస్‌నగర్ కాలనీలలో సర్వే ప్రక్రియను పరిశీలించారు. దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి లబ్ధిదారులను గుర్తించాలని సూచించారు. వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

బంజారి దర్వాజ బస్తీ అభివృద్ధికి కృషి

గోల్కొండ: బంజారి దర్వాజ బస్తీ, పరిసర ప్రాంతాలను అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం గోల్కొండ బంజారి దర్వాజ బస్తీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలతో పాటు పలువురు స్థానికులు తమ తమ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు బంజారి దర్వాజా వద్ద ట్రాఫిక్ పరిస్థితి దారుణంగా ఉంటుందని దీని వల్ల తాము రోడ్డు దాటడానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకుంటున్నామని పలువురు మహిళలు ఆయనతో మొరపెట్టుకున్నారు. తమ ఇళ్ల ముందు కూడా అక్రమ పార్కింగ్‌లు ఉంటున్నాయని రోడ్డుపై అక్రమ పార్కింగ్‌ల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీ అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయిస్తానని అన్ని ప్రాంతాల్లో వీడీసీసీ రోడ్లు వేయించడం జరుగుతుందన్నారు. తాగునీటి సరఫరాను మరింత మెరుగుపరచడానికి జలమండలి అధికారులతో మాట్లాడుతానన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌ను కోరుతానన్నారు. మజ్లిస్ టోలిచౌకీ డివిజన్ అధ్యక్షుడు హారూన్‌ఫరాన్, బంజారి దర్వాజా బస్తీ నాయకుడు బాబురావు తదితరులున్నారు.

ఉద్యోగులకు అండగా టీఎన్జీఓస్

అబిడ్స్: ఉద్యోగులకు టీఎన్జీఓస్ సెంట్రల్ యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సెంట్రల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ పేర్కొన్నారు. శుక్రవారం టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, ఇతర నాయకులు ఫిరోజ్ అహ్మద్, ముజాహీద్ అలీలతో పాటు పలువురు నాయకులు వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం మారం జగదీశ్వర్, ఎస్ఎం.ముజీబ్ హుస్సేనీ మాట్లాడుతూ... దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను అంచెలంచెలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రియదేవ్ ఠాకూర్, శ్రీకాంత్, యోగి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల పక్షాన పోరాటం చేస్తాం

బీఆర్ఎస్ మణికొండ అధ్యక్షుడు సీతారాం



జంగ్‌సైరన్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ మణికొండ నాయకులు

మణికొండ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ సంపూర్ణంగా నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు, మహిళలు, నిరుద్యోగులను మోసం చేస్తున్నదని, రైతుల పక్షాన రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని బీఆర్ఎస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం, నార్సింగి మున్సిపాలిటీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్‌లో పార్టీ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన జంగ్ సైరన్ కార్యక్రమానికి రెండు మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్‌లోని అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం, నార్సింగిలోని అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించి వారు ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయకపోవటం, ప్రతి పంటకు రూ. 500లు బోనస్ ఇస్తానని ఇవ్వకపోవటం, రైతు భరోసా ఇస్తానని ఇవ్వకపోవటం లాంటి మోసాలకు కాంగ్రెస్ ప్రభుత్వం పాల్పడుతుందన్నారు. అలాంటి పార్టీకి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, జి.నరేందర్, ఎ.లక్ష్మణ్‌రావు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, నార్సింగి నాయకులు నాగరాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



బండ్లగూడ నుంచి వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

'రైతు వ్యతిరేకి కాంగ్రెస్'

బండ్లగూడ: రైతులకు మద్దతుగా మాజీ మంత్రి కేటీఆర్ షాద్‌నగర్‌లో శుక్రవారం తలపెట్టిన రైతు దీక్షకు మద్దతుగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడేఉ రావుకోళ్ల నాగరాజు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బండ్లగూడ నుంచి ర్యాలీగా తరలివెళ్లి దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన మోసాలను వివరించి వారి తరఫున దీక్ష చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



ఏజీ వర్సిటీలో చిన్నారెడ్డి తదితరులు

మైలార్‌దేవ్‌పల్లి: గగన్‌పహాడ్ విద్యుత్ సెక్షన్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఖైరతాబాద్ మింట్ కంపౌండ్ ప్రాంతంలోని జీఐఎస్ హుస్సేన్‌సాగర్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకుడు సాయిలు హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా పరిష్కరించుకోవాలన్నారు. నేతలు కిరణ్, మానయ్య, శ్రీనివాస్, రాములు, సీతారామ్, సైదులు, కృష్ణ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీ వర్సిటీలో..

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నూతన సంవత్సర కేలండర్‌ను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అగ్రిహబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, నూతన వంగడాలు, కొత్త పరిశోధనల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వీసీ జానయ్య ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ నూతన కార్యవర్గం

రాయదుర్గం: హెచ్‌సీయూలో అఖిల భారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నూతన కార్యవర్గాన్ని ఏబీవీపీ సెంట్రల్ యూనివర్సిటీల జాతీయ కన్వీనర్ బాలకృష్ణ శుక్రవారం ప్రకటించారు. ఇప్పటికే హెచ్‌సీయూ ఏబీవీపీ నూతన అధ్యక్షుడిగా అనిల్‌కుమార్, కార్యదర్శిగా అయూష్‌కుమార్‌సింగ్ నియామకం అయినట్లు ఆయన గుర్తు చేశారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా సాక్షి, యశస్వి, జైస్వాల్, శివను నియమించినట్లు తెలిపారు. సంయుక్త కార్యదర్శులుగా సత్యంశుక్ల, ప్రభాస్, వైష్ణవి, మానస్, కార్యవర్గ సభ్యులుగా శుభంజైస్వాల్, ప్రాచి, జితేందర్, దేవదత్, సందీప్, అనురాగ్‌సింగ్, బిషాల్, మణికంఠకుమార్, రాహుల్, ఎస్‌హెచ్‌ఓడీ హెచ్ కన్వీనర్లుగా శృతి, సత్యనారాయణ, కార్తికేయ, స్టడీ సర్కిల్ కన్వీనర్‌గా అభిజిత్, సోషల్ మీడియా కన్వీనర్లుగా మహి, బిశ్వజిత్, స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా రితేష్, స్టూడెంట్స్ ఫర్ సేవా కన్వీనర్‌గా వినయ్‌త్రిపాఠి, రాష్ట్రీయ కళా మంచ్ కన్వీనర్‌గా శైలి, ఖేలో భారత్ కన్వీనర్‌గా సునీల్‌రెడ్డి, నార్త్ క్యాంపస్ ఇన్‌చార్జిగా పరమేశ్వర్, సౌత్ క్యాంపస్ ఇన్‌చార్జిగా నవీన్ మోహన్‌ను నియమించినట్లు ఆయన వివరించారు.

రోహిత్ వేములకు నివాళి

రాయదుర్గం: హెచ్‌సీయూ మాజీ విద్యార్థి రోహిత్ వేములకు అంబేడ్కర్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నివాళులర్పించారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో రోహిత్ వేముల స్మారక దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని నార్త్ షాపింగ్ కాంప్లెక్స్‌లో రోహిత్ వేముల స్థూపానికి పూలమాలలు సమర్పించిన తల్లి రాధికావేముల, పలువురు అతిథులు, విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం హెచ్‌సీయూ ప్రధాన ద్వారం వద్ద ఉన్న గుర్రం కలెకురి ఆంపీ థియేటర్‌లో రోహిత్ వేముల స్మారక సమావేశాన్ని ఏఎస్ఏ ఆధ్వర్యంలో నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, రోహిత్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ రోహిత్ చట్టాన్ని అమలు చేయాలని, అడ్మిషన్లు, నియామకాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, కేజీ నుంచి పీజీ వరకు అందరికీ వివక్షత లేని ఉచిత నాణ్యమైన విద్య అందించాలని డిమాండ్ చేశారు. రోహిత్ వేములకు న్యాయం చేయాలని 'రోహిత్ అమర్ రహే' అంటూ నినాదాలు చేశారు. ముఖ్యఅతిథిగా ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ఫ్యాకల్టీ డాక్టర్ లక్ష్మణ్‌యాదవ్, హైకోర్టు అడ్వకేట్ వి.రఘునాథ్, రోహిత్ వేముల తల్లి రాధికా వేముల, జైభీమ్‌రావు, అనుపమ, ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ, చంద్రం పంచమి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ షురూ

సాక్షి, సిటీబ్యూరో: యువ గోల్ఫర్లకు చక్కని వేదికగా నిలుస్తున్న క్షేమా హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ ఐదో సీజన్ ఘనంగా ప్రారంభమైంది. గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్ వేదికగా తొలి రోజు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం 12 జట్ల నుంచి 120 మంది గోల్ఫర్లు టోర్నీలో పాల్గొంటున్నారు. స్వింగ్ కింగ్స్ , రఫ్ రైడర్స్ , ట్యూటోరూట్, సిమెట్రిక్ గోల్ఫర్స్ , మావెరిక్స్ , టీమ్ మైసా, టీమ్ ఆల్ఫా, కళింగా వారియర్స్ , యాంగ్రీ బర్డ్స్ , కాంటినెంటల్ వారియర్స్, ఎంవైకే స్ట్రైకర్స్, ఎగిల్ డర్టీ డజన్ టీమ్స్ ఈ సీజన్ లో పోటీ పడుతున్నాయి. హైదరాబాద్ గోల్ఫ్ కోర్స్, గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ కోర్స్, ఊటీ గోల్ఫ్ కౌంటీ వేదికగా లీగ్ జరగనుంది. వియత్నాంలోని కింగ్స్ ఐలాండ్ గోల్ఫ్ కోర్సులో ఫైనల్స్ జరగనున్నాయి. ప్రతీ సీజన్ కూ గోల్ఫర్స్ నుంచి స్పందన పెరుగుతూ రావడం సంతోషమని లీగ్ కమిషనర్ డీఎస్ సుమంత్ చెప్పారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

గోల్కొండ: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ పాలక మండలి నిబంధనలను తుంగలో తొక్కిందని ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని తాము అడ్డుకుంటామని బీఆర్ఎస్ నాయకులు రెండు రోజుల ముందుగానే ప్రకటనలు చేసి నిరసన కార్యక్రమానికి సిద్ధమవుతున్నారు. ఈ విషయం తెలియగానే గుడిమల్కాపూర్ పోలీసులు శుక్రవారం ఉదయం బీఆర్ఎస్ నాయకుడు టి.జీవన్‌సింగ్‌తో పాటు మొత్తం 42 మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి టపాచపుత్ర పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా టి.జీవన్‌సింగ్ మాట్లాడుతూ.. మార్కెట్ కమిటీ పాలక మండలిలో మహిళలకు స్థానం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని శుక్రవారం సాయంత్రం 5 గంటలకు విడుదల చేశారు.

నేడు 'సమాలోచన'

చార్మినార్: ఆది పురుషుడు–ఆది ధర్మం అనే మాదిగల పవిత్ర గ్రంథ ఆవిష్కరణ కోసం సమాలోచన కార్యక్రమాన్ని ఈ నెల 18న బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోని షోయబ్ హాల్‌లో నిర్వహించనున్నట్లు గ్రంథ రచయిత ప్రొఫెసర్ ఏకు తిరుపతి తెలిపారు. సృష్టిలో మాదిగల విశిష్టత, వారి జీవన ప్రయాణం, సామాజిక స్థితిగతులపై సమాలోచనకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమాలోచనను కొలనుపాక స్వయంభు ఆది జాంబవ మఠం ట్రస్ట్, సాంస్కృతిక అధ్యయన కేంద్రం నిర్వహించనున్నామన్నారు. జరిగే మాదిగ కుల సంఘాలు, మేధావులు ఉద్యోగులు, విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.

వాహన బీమా.. తస్మాత్ జాగ్రత్త..!

- నగరంలో విస్తరించిన నకిలీ బీమా ముఠా
- పట్టుబడ్డ ముగ్గురు నిందితులు.. పరారీలో 11 మంది



నకిలీ బీమా ముఠా సభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, ఫోన్లు

శంషాబాద్: వాహనాలకు నకిలీ బీమాలు చేస్తున్న ఓ ముఠా గుట్టు రట్టయింది. వాహనదారులు ప్రమాదం జరిగిన తర్వాత సంబంధిత కంపెనీలకు క్లెయిమ్ చేయడంతో వీరి అసలు రంగు బయటపడింది. శంషాబాద్ పట్టణంలో నకిలీ ఇన్సూరెన్స్‌ల ద్వారా నష్టపోయిన వారు సైబరాబాద్ పోలీసులకు ఆశ్రయించడంతో నకిలీలకు పాల్పడుతున్న ముఠాలోని ముగ్గురిని శంషాబాద్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకుని ఆర్‌జీఐఏ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

ఆర్టీఏ ఏజెంట్‌లే..


నకిలీ బీమాలు చేస్తున్న వారిలో ప్రధానంగా ఆర్టీఏ ఏజెంట్‌లే ఉన్నారు. ప్రధాన నిందితుడుగా కిషన్‌బాగ్‌కు చెందిన అవేస్ (32), శంషాబాద్ ఆర్‌బీనగర్ కాలనీలో నివాసముంటున్న నాగర్‌కర్నూల్‌కు చెందిన శ్రావణ్‌కుమార్‌గౌడ్(31) షాబాద్ మండలంలోని సర్దార్ నగర్‌కు చెందిన మోర్చు శివకుమార్‌లు ఈ దందా నడిపిస్తున్నారు. ఇందులో ఇద్దరు ఆర్టీఏ ఏజెంట్‌లుగా పని చేస్తున్నారు. ఈ ముగ్గురు కలిసి నగరలోని ప్రకాష్, అజీమ్, అస్లాం, శ్రీనివాసులు, మజహర్, రవికాంత్, లైకుద్దీన్, ఖాజా, ఐజాజ్, హసన్, రాములతో కలిసి నకిలీ బీమాల దందా కొనసాగిస్తున్నారు.

బాధితుల ద్వారానే..

నకిలీ ముఠా నుంచి ఓ ప్రైవేటు సంస్థ ద్వారా బీమా పాలసీలు పొందిన కొందరు బాధితులు వాహన ప్రమాదానికి గురైన తర్వాత సంబంధిత సంస్థలను ఆశ్రయించడంతో అవి నకిలీవిగా తేలాయి. దీంతో వారు పోలీసులకు ఆశ్రయించారు. ఎస్ఓటీ పోలీసులు నిఘావేసి శుక్రవారం ఉదయం ప్రధాన నిందితులైన ముగ్గురిని తొండుపల్లి వద్ద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి మూడు వాహనాలు, కంప్యూటర్లు, నకిలీ బీమా పత్రాలు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నగర వ్యాప్తంగా నకిలీ బీమా ముఠాకు చెందిన బాధితులు ఉన్నట్లు పోలీసులు గుర్తించి దర్యాప్తు చేస్తున్నారు.

ఎంపీపీ నుంచి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా..

- చరిత్రను తిరగరాసిన చైర్మన్
- అరుదైన ఘనత సాధించిన మల్లేష్




తలారి మల్లేష్

మణికొండ: ఆ పదవిని చేపట్టిన వారెవరికీ రాజకీయ భవిష్యత్తు ఉండదనేది పూర్వ రాజేంద్రనగర్ మండలంలో నానుడి. అందరూ అన్నట్టుగానే ఇప్పటి వరకు ఎవరూ ఆ చరిత్రను తప్పించుకోలేక పోయారు. ఎట్టకేలకు ఇపుడు మాత్రం శుక్రవారం ఆ పదవిని చేపట్టిన అనంతరం మరింత అత్యున్నత పదవికి ఎంపికై ఆయన చరిత్రను తిరగరాశారు. వివరాలివీ... పూర్వ రాజేంద్రనగర్ మండలం, ప్రస్తుత గండిపేట మండలం నుంచి మండల పరిషత్ అధ్యక్షుడి (ఎంపీపీ)గా పనిచేసిన వారు అక్కడితోనే వారి రాజకీయ జీవితాన్ని ముగించారు. అందులో నర్సింహులు, దేవదానం, సత్యనారాయణ, అనిత వెంకటేశ్ ఉన్నారు. వీరిలో అనితా వెంకటేశ్ మాత్రం ఎంపీపీగా పనిచేసిన తరువాత మరోసారి ఎంపీటీసీ, ప్రస్తుతం కార్పొరేటర్‌గా గెలుపొందారు. మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల పరిధిని పరిపాలించిన ఆమె అంతకంటే ఉన్నత స్థానానికి ఎదగకపోవటంతో అదే నానుడి ఇప్పటి వరకు కొనసాగింది.

మారిన చరిత్ర...

గండిపేట మండలానికి మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన వారు అంతకంటే ఉన్నత స్థాయి పదవిని పొందలేరనే చరిత్రను గత ఎంపీపీ తలారి మల్లేష్ తిరగ రాశారు. ఆయన మండల పరిషత్ అధ్యక్షుడిగా పదవి అయిపోయిన తరువాత దాదాపు ఐదు సంవత్సరాల పాటు రాజకీయ నిరుద్యోగిగా ఉండి పాత చరిత్రలో ఇతనూ నిలుస్తారని అందరూ భావించారు. రాజేంద్రనగర్, చేవెళ్ల, కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఐదేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీలో ఉన్నపుడు అది ఆయనకు దక్కలేదు. 2023లో బీఆర్ఎస్ పార్టీలో గెలుపొందిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇటీవల కాంగ్రెస్‌లో చేరటంతో ఆయనతోపాటే తలారి మల్లేష్ సైతం పార్టీ మారారు. ఎమ్మెల్యే పార్టీ మారే సమయంలోనే గుడిమల్కాపూర్ మార్కెట్ పదవిని తలారి మల్లేష్‌కు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద మాట తీసుకున్నారు. దానికి ముఖ్యమంత్రి సమ్మతించటం, ఎమ్మెల్యే పార్టీ మారటం, ప్రస్తుతం గుడిమల్కాపూర్ చైర్మన్‌గా తలారి మల్లేష్ ఎంపిక కావటం, శుక్రవారం పదవీ ప్రమాణ స్వీకారం చేయటం పూర్తయ్యాయి.

చైర్మన్, డైరెక్టర్‌లకు సన్మానం



రాజేంద్రనగర్: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, డైరెక్టర్ బండారి శంకర్‌లను శుక్రవారం రాజేంద్రనగర్ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం నాయకులు కృష్ణమాచారి, సత్యనారాయణ ముదిరాజ్, రాధేశ్యాం తదితరులు వారిని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తలారి మల్లేష్ చైర్మన్‌గా గుడిమల్కాపూర్ మార్కెట్ మరింత అభివృద్ధి పథంలోకి రావడం ఖాయమని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

దరఖాస్తులు వేలల్లో.. అర్హులు వందల్లో..

- మున్సిపాలిటీలో రేషన్ కార్డులకు అర్హులు 815
- భారీగా జరిగిన వడపోత ప్రక్రియ
- ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో అర్హుల ఎంపిక

శంషాబాద్: ప్రజాపాలనలో రేషన్ కార్డు కోసం వేలల్లో దరఖాస్తుల వచ్చినా ప్రస్తుతానికి వందల్లో మాత్రమే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. శంషాబాద్ మున్సిపాలిటీలో మొత్తం 815 మంది దరఖాస్తుదారులకు మాత్రమే రేషన్ కార్డుల అందించేందుకు అర్హులుగా నిర్ణయించి సబంధిత జాబితా ఆధారంగా తాజాగా క్షేత్ర స్థాయి ఎంపిక ప్రక్రియ చేపడుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తులో రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసిన వారి ఆర్థిక, ఉద్యోగ, ఆస్తులకు సంబంధించిన ఆధారాలతో పెద్ద ఎత్తున వడపోతను చేపట్టారు. ప్రస్తుతానికి మాత్రం వేయి లోపు మాత్రమే జాబితా విడుదల కాగా వారి ఫోన్, ఆధార్ తదితర నంబర్ల ద్వారా వారివారి ఇళ్ల వద్దకు చేరుకుని పరిశీలన చేపడుతున్నారు. ఈ నెల 26 నుంచి సంబంధిత అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందనున్నాయి.

ముగిసిన సొడమ్మ జాతర



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సొడమ్మ జాతర శుక్రవారం ముగిసింది. సంక్రాంతి పండగ అనంతరం మూడు రోజుల పాటు సొడమ్మ గుట్టపై జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు. మూడు రోజుల పాటు నిర్వహించిన జాతరలో భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి బోనాలతో పాటు ఒడి బియ్యం పోసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజు కావడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సమస్యలపై అవిశ్రాంత పోరు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

శంషాబాద్: ప్రజాసమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఆ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. శుక్రవారం పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... ప్రభుత్వ విధానాలు ప్రజలకు శాపంగా మారకూడదన్నారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే సీపీఐ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమైన వారి సమస్యల పరిష్కారానికి నేతలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్లు యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ క్యాంపస్ ఆస్పత్రికి ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు

అందజేసిన స్వతంత్ర విద్యార్థి బృందం విద్యార్థులు



ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందిస్తున్న ఇండిపెండెంట్ స్టూడెంట్స్ గ్రూప్ విద్యార్థులు

రాయదుర్గం: దేశవ్యాప్తంగా హెచ్‌పీఎంవీ వైరస్ చర్చనీయాంశంగా మారుతున్న తరుణంలో హెచ్‌సీయూ క్యాంపస్‌లోని వైద్య కేంద్రానికి స్వతంత్ర విద్యార్థి బృందం విద్యార్థులు రెండు చిన్న ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను శుక్రవారం అందించారు. క్యాంపస్ వైద్య కేంద్రంలో చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ వినీత్ నాయర్, సీఎంఓ కెప్టెన్ రవీంద్ర కుమార్, సీఎంఓ డాక్టర్ అనుపమకు ఈ రెండింటినీ విద్యార్థులు అందించారు. ఈ సందర్భంగా స్వతంత్ర విద్యార్థి బృందం ప్రతినిధి ఆకాష్‌బాటి మాట్లాడుతూ... ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా క్యాంపస్ వైద్య కేంద్రంలో ఆరోగ్య మౌలిక సదుపాయాలను పెంచడం లక్ష్యంగా పెట్టుకొని వీటిని అందించినట్లు వివరించారు. మా బృందంలోని విద్యార్థులంతా కలిసి సొంతంగా నిధులను సమీకరించి వీటిని అందించినట్లు ఆయన స్పష్టం చేశారు. హెచ్‌పీఎంవీ వైరస్ అంతగా లేదని, ముందు జాగ్రత్తల విషయంలో అవగాహన కల్పించడంలో కూడా ముందుంటామన్నారు. కార్యక్రమంలో వైద్య కేంద్రం డాక్టర్ సి.గంగాధర్, నర్సింగ్ విభాగం ప్రతినిధి కె.హిమబిందు, మల్లేశ్వరి, విద్యార్థులు కర్నీసింగ్, కిరిస్టన్, రీతాం జలిపాత్ర, కైలాష్‌బిష్ణోయ్, సంగమేష్‌రెడ్డి, సచిన్, అంకిత్, హర్ష, ఆనంద్, కమల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు

శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్

శేరిలింగంపల్లి: ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జీ జగదీశ్వర్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టనున్న ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డుల పంపిణీ వంటి పథకాల్లో భాగంగా అధికారులు ఇంటింటి పర్యటన చేసి అర్హుల గుర్తింపు ప్రారంభించారన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అర్హుల ఎంపిక జరిగే విధంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకం చేరేలా అధికారులు కృషి చేయాలని కోరారు. పేదల కలలను నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఈనెల 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు అందించే ప్రక్రియ ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో 2.81 కోట్ల మందికి ఇప్పటికే 90 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయన్నారు. రేషన్ కార్డులు జారీ ప్రక్రియ ఇక నిరంతరం కొనసాగుతుందన్నారు.